



# చిన్ని చిన్ని ఆశ

**పోడూరి కృష్ణకుమారి**

ఆదివారమేకదా అని ఆలస్యంగా లేచి బద్ధకంగా వచ్చి టీవీ ముందు కూచుని వార్తలు చూస్తున్న తాతగారి వళ్ళో చేరింది సాక్షి.

టీవీలో ఆవేశంగా ఆపుకోకుండా మాట్లాడుతున్న మహిళామణిని చూసి "అచ్చు మా ప్రిన్సిపాల్ మేడమ్‌లాగా ఉంది ఎవరు తాతా?" అని అడిగింది.

"సాక్షీ మొహం కడిగావా?" వంటింటిలోంచి రమకేక పెట్టింది.

"కడిగానులే మమ్మీ అప్పుడే పాలొద్దు. నువ్వు చెప్పు తాతా! ఆ మేడమ్ ఎవరూ?" ఇంకా టీవీలో అనర్గళంగా అరుస్తున్న ముఖాన్ని చూస్తూ మళ్లీ అడిగింది.

"ఆవిడ ఓ తలనెరిసిన పార్టీలో నా చిన్నప్పట్నించీ పనిచేస్తున్న పెద్ద తలకాయ" మనవరాలికి రాజకీయ పరిజ్ఞానం అందించాలని మొదలెట్టాడు తాత నారాయణరావు.

"ఆవిడ తలంతా అలా నెరిసిపోయింది కాబట్టి ఆవిడ పార్టీ తలనెరిసిన పార్టీ అయిందా?" సాక్షి ప్రశ్న.

"కాదు ఆవిడా పార్టీలో చేరేటప్పటికే ఆ పార్టీ తలనెరిసిన పార్టీ లిస్టుల్లో కెక్కింది"

"అసలు తలనెరిసిన పార్టీ అంటే ఏంటీ?" చెప్పేవాళ్లుంటే సాక్షి ఏదైనా చెప్పించుకుంటుంది. ఎప్పుడూ కథ చెప్పమంటే పెద్దవాళ్ళు విసుక్కుంటారు కాబట్టి వాళ్ల ఇష్టం వచ్చినది ఏది చెప్పినా బుద్ధిగా విని అందులో తనకు పనికొచ్చేదేదైనా ఉంటే గుర్తుపెట్టుకుంటుంది సాక్షి.

"నీక్కొంచెం తెలుసుకదా, పార్టీలంటే ఏంటో! అలా పార్టీల్లో కొన్ని తలనెరిసిన పార్టీలుంటాయి, కొన్ని బొద్దూదని పార్టీలుంటాయి. ఇంకా కొన్ని తలకు మాసిన పార్టీలుంటాయి" అంటూ మొదలెట్టాడు నారాయణ.

సాక్షి పకపకా నవ్వింది "బొద్దూదని..బొద్దూ..హహ్హహ్హా! తాతా! ఎవరికైనా బొద్దూడిపోతుందా? పొట్టకే ఉంటుంది కదా? ఛీఛీ? హహ్హహ్హా!" సాక్షి కింద కూలబడిపోయి పకపక నవ్వుతుంటే బామ్మ లీలక్కూడా నవ్వొచ్చింది.

"ఊరుకోండి! మీ రాజకీయ పరిజ్ఞానం అంతా చిన్నపిల్ల ముందు ప్రదర్శించి దాని బుర్రపాడు చెయ్యకండి. మీరూ మీ వెటకారాలూను" నవ్వుతూనే కేకలేసింది లీలమ్మ.

"సాక్షీ! మర్చిపోయావా ఇవాళ రాధక్క పెళ్ళికెళ్ళాలి స్నానం చేసి కొత్తడ్రెస్సు వేసుకుందువుగానీ" తండ్రి సతీష్ పిలుపువిని హుషారుగా లేచింది సాక్షి.

"తాతా లేలే. నువ్వూ తయారవ్వు. మనం పెళ్ళికెళ్ళాలి" గెంతుకుంటూ తల్లి దగ్గరకెళ్ళిపోయింది సాక్షి.

నారాయణరావు కూడా నవ్వుకుంటూ తయారవడానికి లేచాడు. అందరూ తయారయ్యాక కార్లో పెళ్ళికి బయల్దేరారు. వెనక సీట్లో బామ్మ తాతల మధ్య కూచుని కబుర్లు చెపుతూ ప్రయాణం సరదాగా గడిపేసింది సాక్షి.

పెళ్ళింటికి వెళ్ళాక అక్కడ సాక్షి ఈడు పిల్లలెవరూ లేరు. కాస్త పెద్దపిల్లలు వాళ్ళ కాలక్షేపాలు వాళ్లు వెతుక్కుంటున్నారు. వాళ్ళ ఆటలు చూస్తూ సాక్షి నెమ్మదిగా వంటలు జరుగుతున్న చోటు చేరింది. అక్కడ పెద్ద పెద్ద పాత్రలలో పేద్ద మంటల మీద వంటలు వండేస్తున్న పెద్దపెద్దవాళ్ళని, హడావిడినీ చూస్తూ నుంచుంది. అసలే చలికాలం ఏమో అక్కడి వేడి వాతావరణం సాక్షికి నచ్చింది.

"సీతా, కానీ గబగబా!" అన్న పిలుపు వినిపించిన వైపు చూసింది. ఓ పెద్ద మూకుడు స్టౌమీద కెక్కిస్తూన్న ఓ సన్నపాటి 'ఆంటీ' కాస్త దూరంగా కూచున్న ఓ చిన్నపిల్లని పిలుస్తోంది. ఆ అమ్మాయి కళ్ళు పెద్దవి చేసి సాక్షి వైపే చూస్తోంది. సరిగ్గా సాక్షి వయసే ఉంటుంది. చేతిలో ఓ చాకు ఉంది. ముందర పళ్ళెంలో తరిగిపోసిన కూరముక్కలున్నాయి. "ఇచ్చినవన్నీ తరిగేసాను ఇంకా ఏం తరగాలీ?" అంటూ ముక్కల పళ్ళెం తీసుకోడానికొచ్చిన తల్లితో "అమ్మా చూడే ఆ పాప డ్రెస్సెంత బాగుందో! నాకూ అలాంటిది కొంటావా?" అంది సీత అని పిలవబడ్డ ఆ పాప. తల్లి నీరసంగా ఓ నవ్వు నవ్వి, ఇంకొన్ని కూరలు సీత ముందుపోసి స్టౌ వైపు కదిలింది.

సీత తల్లి కొంగుపట్టుకుని తల్లి వెనకే వెడుతూ "నా డబ్బుతో నే కొనుక్కుంటా" అంది.

"సరేలే చూద్దాం. వాటి సంగతి చూడు" తను మళ్ళీ పోసిన కూరలకుప్ప చూపించింది తల్లి. కొంగు వదిలి కాళ్లను చుట్టుకుంది సీత.

"చూద్దాం కాదు. కొనిపెట్టాలి"

"సరే నీకొచ్చిన డబ్బుల్తో ఎలాంటి డ్రస్సొస్తే అది కొనిపెడతా. ఇంక అంతకంటే ఎక్కువియ్యను. ముందు పని చూడు. పని మానేస్తే అసలేం రాదు" తల్లి కాళ్ళు వదిలింది సీత.

"మళ్ళీ మాట మార్చకూడదు. నా డబ్బుతో నాకు డ్రెస్సు" ఒప్పందం కుదుర్చుకుని వొచ్చి చాకు పుచ్చుకుని కూరలకుప్ప ముందు కూచుంది.

తల్లీ కూతుళ్ల మాటలు కుతూహలంగా వింటున్న సాక్షి సీత దగ్గరకెళ్ళి నుంచుని స్నేహంగా నవ్వింది.


సీత కూడా నవ్వి "అదిగో ఆ పీట ఇల్లా ఈ పక్కకు లాక్కుని కూచో. డ్రెస్సుమీద అవీ ఇవీ పడతాయ్" అంది ఆరిందాలాగా. ఎత్తుగా ఉన్న ముక్కాలిపీట లాక్కుని కూచుంది సాక్షి.

"మహబాగుందిలే నీ డ్రెస్సు. ఎక్కడ కొన్నావేంటి?"కసాపిసా కూరలు తరిగేస్తూ అడిగింది సీత.

సీత ప్రశ్నకి జవాబివ్వకుండా "మీ అమ్మనిన్ను చాకు ముట్టుకోనిస్తుందా? చెయ్యి కోసుకుంటావ్ అని అరిచేసి మా ఇంట్లో ఎవ్వరూ నన్ను చాకు ముట్టుకోనివ్వరు" అంది సాక్షి.

సాక్షి మాటలు వినబడనట్టు "మీ అమ్మ బట్టకొని కుట్టించిందా? రెడీమేడే కొనేసిందా? ఆ చమ్కీలు తరువాత కుట్టించారా, అసలు ముందే కుట్టేసున్నాయా?" అనడిగింది సీత.

“నాకా చాకోసారిస్తావా? నేనూ నీలాగే అన్ని ముక్కలూ సమానంగా వచ్చేలా తరగగల నేమో చూస్తాను” అంది సాక్షి.




‘నీ డ్రెస్సొకసారి నన్ను వేసుకోనిస్తావా నేనూ అచ్చం నీలాగా ఉంటా నేమో చూస్తాను’ అని అనాలని సీత నోటి చివరిదాకా వచ్చింది కానీ అనలేదు. అమ్మ వింటంటే విప్మీద వి ఎ ా నా ల ం పేల్తాయి!’ “ఒద్దులే నువ్వు చెయ్యి కోసు కుంటే నన్ను తిడతా రందరూ” తలొంచుకుని పరపరా తరిగెయ్యడం మొదలెట్టింది.

“నీ డబ్బుతో నువ్వు డ్రస్సులు కొనుక్కుం టావా? నీకు డబ్బెక్కడిది? ఎవరిచ్చారు?” అమాయ కంగా అడిగింది సాక్షి.

సీతకు హుషారొచ్చింది. నాలుగు కెరేట్ ముక్కలు నోట్లో వేసుకుని ఇంకో నాలుగు ముక్కలు సాక్షి చేతిలో వేసింది. నమిలేకొద్దీ తీపెక్కాయి ఆ ముక్కలు ఇద్దరికీ.

“ఎవరిస్తారేంటీ? అదుగో ఆ పెద్దాయన లేరూ, ఆయనే మా కేటరింగు కంపెనీ హెడ్డు. ఆయన మా అమ్మకి ఇలా వంటలు చెయ్యడానికొచ్చినప్పుడు రోజుకు నూటేభై ఇస్తాడు. ఈసారి రెండొందలిస్తు న్నాడు. నేను కూరలు తరగడం, ఇంకా చేతికింద పనులేవైనా చెప్తే చెయ్యడం ఇలాంటివి చేస్తే నాకు రోజుకి వంద ఇస్తానని మాటిచ్చాడు. మాకిక్కడ మూడు రోజులు పని. నాది నేను సంపాదించుకుం టాను. డ్రెస్సు కొనుక్కుంటాను” గర్వంగా చెప్పింది సీత.

“ఇవాళైతే ఆదివారం, మరి రేపైతే స్కూలుం టుంది కదా వెళ్ళవా?” కంగారుగా అడిగింది సాక్షి. తన ఈడు పిల్లలందరూ తనలాగే రోజూ స్కూలుకె ళతారని సాక్షి నమ్మకం. లోకం తెలియదుకదా.



“మామూలుగా సెలవరోజే ఇలా అమ్మ వెనక సాయం చెయ్యడానికొస్తాను. కానీ ఇప్పుడు ఇద్దరు వంటవాళ్ళు మానేసి వేరే కంపెనీ కెళ్ళిపోయారు. అందుకని ఈ రెండురోజులూ కూడా నన్నిక్కడ పనికే ఉంచెయ్యమన్నారు హెడ్డుగారు. ఉంటాను. సంపాదించుకుంటాను.”

“అమ్మో! ప్రిన్సిపాల్ మేడమ్ పనిష్మెంటిచ్చి ఫైన్ వెయ్యదా?” కళ్ళు పెద్దవి చేసి భయంగా అడిగింది సాక్షి.

“మా మున్సిపల్ బళ్ళో అసలు హాజరే రోజూ వెయ్యరు. నేనొచ్చానో రాలేదో ఎవరికి తెలుసు? మీ కాన్వెంట్లలోనే అన్నిటికీ ఫైన్లేసి డబ్బు గుంజు తారు” సాక్షి అమాయకత్వానికి నవ్వుకుంటూ కాస్త లోకజ్ఞానం పంచింది సీత.

“మీ స్కూల్లోనే అందరూ మంచివాళ్ళల్లా ఉన్నారు” అసూయపడింది సాక్షి.

“సీతా! ఓ సారిలా వచ్చి ఇదందు కోమ్మా” హెడ్డు వంటాయన పిలిచేసరికి లేచింది సీత.

“సాక్షీ ఇక్కడున్నావా? లక్ష్మి అంటీ వాళ్ళొచ్చారు రా. అందరూ నిన్ను చూడాలని అడుగుతున్నారు పద” రమ వచ్చి సాక్షిని పిలవడంతో దూరంగా ఏదో చేస్తున్న సీతతో, “సీతా! నే వెడు తున్నా మళ్లీ వస్తా బై” అని చెయ్యూ పింది. “బై బై” సీత కూడా చింతపండు పులుసుతో తడిసిన చెయ్యి ఊపింది.

“ఎవరే ఆ పిల్ల?” రమ ప్రశ్నకి “నా ఫ్రెండు” గర్వంగా చెప్పింది సాక్షి వెనక్కి వెనక్కి చూస్తూ. పెళ్లికొచ్చిన వాళ్లల్లో చాలామంది రమ ఫ్రెండ్స్. వాళ్ళ పిల్లలు ఇంక సాక్షిని వదల్లేదు. సీత గురించి మర్చిపోయింది సాక్షి. పెళ్ళీ, భోజనాలు అయి సాక్షి కుటుంబం కారెక్కి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు.

అలిసిపోయిన సాక్షి బామ్మ వళ్ళో ఒరిగిపో యింది. పెద్దవాళ్ళు చెప్పుకుంటున్న పెళ్ళి విశేషాల కబుర్లు జోలపాటలాగా మత్తెక్కించాయి సాక్షికి. “అబ్బో, మహా ఘనంగా చేసాడే ఈయన కూతురి పెళ్ళి! ఆ హాలు అద్దె రోజుకి యాభైవేలుట!” అంది లీల.

“భోజనాలు ఒక్కో ప్లేటు రెండొం దలుట” డ్రైవ్ చేస్తున్న సతీష్ అన్నాడు. ఆ మత్తులోనే “తాతా, వందంటే హండ్రెడేనా?” సాక్షి అడిగింది.

“అవును” అన్నాడు నారా యణరావ్. సాక్షి మత్తుగా ఏవో లెక్కలేసుకుంది.

“అయితే మనం అక్కడ అన్నం తిన్నందుకు థౌజండ్ రుపీస్ ఇచ్చావమా?” అడి గింది. అందరూ ఒక్క సారి ఫక్కుమన్నారు.


‘‘దా దా ప్ప అంతే అయింది. నేను గిఫ్ట్ కవర్లో వెయ్యినూట పద హార క్ష పెట్టిచ్చాను” అంది రమ.

మళ్ళీ అంతా నవ్వారు. వాళ్ళెందుకు నవ్వుతున్నారో సాక్షికి అర్థం కాలేదు. కానీ లెక్కలు భయపెట్టాయి.

"ఏం పెళ్ళిల్లో ఏంటో! ఎందుకొచ్చిన దండగ ఖర్చులు?" అంటూ ఇదివరకటి పెళ్ళి ఖర్చుల గురించి చెప్పడం మొదలెట్టింది లీల.

ఆరోజు రాత్రి బామ్మ, తాతల మధ్య పడుకున్న సాక్షి ఏదో ఆలోచిస్తూ మథన పడుతోందని గ్రహించింది లీల. "ఏమిటి చిట్టితల్లీ ఆలోచిస్తున్నావ్?" అనునయంగా అడిగింది.

"బామ్మా, మరీ, సీతావాళ్ళు కూడా రోజుకి రెండొందలిచ్చి భోజనం చెయ్యాల్సిందేనా ఆ పెళ్లింట్లో ఉన్నన్నాళ్ళూ?" నిముష నిముషానికీ భారం పెరిగిపోతూ తనని






వేధిస్తున్న సమస్య బైటపెట్టింది సాక్షి.

"సీతెవరూ?" చెప్పింది.

నారాయణరావు సాక్షిని ఒళ్ళోకి తీసుకుని అర్థమయ్యేలా వివరించాడు.

"అయితే సీతా వాళ్ళూ ఫ్రీగా భోజనం చెయ్యచ్చూ ప్లస్ వాళ్ళకి హెడ్డు డబ్బు కూడా ఇస్తాడు అంతేనా?" కొంచెం శాంతించి అడిగింది సాక్షి.

"కరెక్ట్. వాళ్ళ డబ్బు వాళ్ళకొస్తుంది. రాదేమోనని బాధపడకు" అంది లీల. ఒక్కసారి పెద్దబరువేదో నెత్తిమీంచి దిగిపోయినట్టు నిట్టూర్చి. "అయితే సీతకి డ్రెస్సొస్తుంది" సంతోషంగా నిద్రపోయింది సాక్షి, ఆ డ్రెస్ ఖరీదు తెలీదు కాబట్టి.

మూడు రోజుల తరువాత అలిసిపోయి ఒళ్ళు పులిసిపోయి, ప్రాణం విసిగిపోయి తల్లితోపాటు ఇల్లు చేరింది సీత. వేడినీళ్ళ స్నానం చేసి తల్లి కలిపిచ్చిన మజ్జిగన్నం తినేసరికి ప్రాణం లేచొచ్చినట్టనిపించింది. ఆ రాత్రి తల్లి డొక్కలో దూరి పడుకున్న సీతకి సాక్షి గుర్తొచ్చింది. ఆరోజు ఆఖరి బంతిలో కూచుని భోజనం చేస్తుంటే సాక్షీవాళ్ళు వెళ్ళిపోవడానికి కారెక్కడం చూసింది సీత. చటుక్కున లేచి కారు వైపు పరుగెత్తుకెళ్ళింది. సాక్షికి మళ్ళీ బై చెప్పి రేపు కూడా వస్తుందేమో అడుగుదామని. సీత వెళ్ళేసరికే కారు స్టార్టయిపోయి దుమ్మురేపుకుంటూ వెళ్ళిపోయింది. నిరాశగా ఒక్క నిముషం అక్కడే నిలబడ్డ సీతకి అక్కడున్న ఆడవాళ్ళ మాటలు చెవినపడ్డాయి.

"ఎలాగైనా రమ టేస్టే బెస్టు. భలే గ్రాండుగా కట్టిందిలే చీర. సాక్షికి వేసిన డ్రెస్సు రెండువేలుట. మూడునెలల్లో పొట్టయిపోతుంది. నేనయితే పిల్లల బట్టలకంత పెట్టను బాబూ" అంటోందొకావిడ. ఆ క్షణంలో సీత గుండెల్లో పెద్దబండరాయి పడ్డట్టయింది.

జ్ఞాపకాల నుంచి తేరుకున్న సీత ఏదో నిర్ణయానికొచ్చినట్టు పక్కమీంచి లేచింది. తను పెళ్ళింటికి బట్టలు సద్దుకెళ్ళిన సంచీ తెరిచింది. బట్టల అడుగున హెడ్డుగారిచ్చిన మూడొందలూ భద్రంగా ఉన్నాయి. అవి పైకి తీసింది. చాపమీద నిద్రపట్టక ఏదో ఆలోచిస్తున్న తల్లి పక్కన చేరింది.

"అమ్మా, ఇంటివాళ్ళబ్బాయి రమేష్ వాళ్ళ స్కూల్లో నోట్సులు బాగా చెపుతారు. నేనీ ఏడాది టెక్స్ట్ పుస్తకాలే సరిగ్గా అన్నీ కొనుక్కోలేదు. రేపు బజారెళ్ళి టెక్స్టులూ, కొన్ని నోటు పుస్తకాలూ కొందాం. రమేష్ దగ్గర నోట్సులు రాసుకుని బాగా చదువుకుంటాను. డ్రెస్సొద్దులే" అంది తల్లి చేతిలో డబ్బు పెట్టి.

## ఎక్స్'పోజింగ్' బేబి!

మూన్‌మూన్ సేన్ కూతురు రియాసేన్ తల్లిని మించిన తనయ. ఒంపుసొంపులు ప్రదర్శించడంలోను, అందాలతో కనువిందు చేయడంలోను ఆమెకు సాటి మరెవరూ ఉండరు. టీనేజీ నుంచీ ఎక్స్'పోజింగ్' చేయడంలో రియాసేన్‌ది అందెవేసిన చెయ్యి. ఆమె చేసిన పాప్ సాంగ్స్‌లో రియాసేన్ అందాలకు చిత్తుకాని ప్రేక్షకులుండరు. విష్‌కన్య, తాజ్‌మహల్ (తమిళ) చిత్రాల్లో తన ప్రతిభ చూపించిన రియాసేన్‌కి టర్నింగ్ పాయింట్ మాత్రం 'స్టైల్' చిత్రం. కానీ ఇంతవరకూ పాపం ఆమెకి హిట్టు లేదు. ఎంత పేరు తెచ్చుకున్నా లాభం లేదు, నిర్మాత జేబులు నిండితేనే ఏ హీరోయిన్‌కైనా స్టార్‌డమ్ నిలబడేది!